# విప్లవ కార్మికోద్యమ నాయకుడు

# కా॥ ఎన్.వి. కృష్ణయ్య వర్ధంతిసభ



వర్ధంతిసభలో ప్రసంగిస్తున్న కా॥జె.కిషోర్‌బాబు

**యాతలూరు, 13-9-16 :**

సిరిసిల్ల మాజీ ఎమ్మెల్యే, సిపిఐ(ఎం-ఎల్) నేత కా॥ ఎన్.వి. కృష్ణయ్య 10వ వర్ధంతిసభ 13-9-2016న ఆయన స్వగ్రామమైన యాతలూరులో జరిగింది. సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కా॥ జె.కిషోర్‌బాబు ఈ సభలో పాల్గొని మాట్లాడుతూ ఎన్.వి. కృష్ణయ్య భూస్వామ్య కుటుంబంలో పుట్టినా భూస్వామ్య - పెత్తందారీ దాష్టీకాలకు వ్యతిరేకంగా దళితులపక్షాన నిలబడి పోరాడారంటే, కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని స్వీకరించటంవలనే అన్నారు. తరిమెలనాగిరెడ్డి, చంద్రపుల్లారెడ్డి వంటి కమ్యూనిస్టు విప్లవనేతలవైపు నిలబడి ప్రజాందోళనలో చురుగ్గా పాల్గొన్నారని అన్నారు. ప్రస్తుత రాజకీయ పరిణామాల గురించి మాట్లాడుతూ, నోకియా సెల్ కంపెనీ 21 వేల కోట్ల రూ॥ ఆదాయం పన్ను ఎగవేసి దేశం నుంచి పారిపోతే ఒక్క రూపాయి కూడా కట్టించుకోని పాలకులు, పన్నులు పెంచుతూ ప్రజల ముక్కుపిండి వసూలు చేస్తున్నారన్నారు. రాయలసీమ ప్రాంతంలో కరువు వచ్చి వేరుశనగ పంట ఎండిపోతుంటే సకాలంలో స్పందించకుండా రెయిన్‌గన్లు పెట్టి సాగునీరందించినవాడిలా చంద్రబాబు ఫోజుపెట్టి చేతులు దులుపుకున్నాడని వివరించారు.

కేంద్రంలో అధికారంలో వున్న బిజెపి పాలకులు ప్రజలను మౌలికసమస్యల నుండి పక్కదారి పట్టించే విధంగా మత, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతున్నారని, కావేరీ జలాల వివాదంలోకి ప్రజలను ఈడ్చి రెండు రాష్ట్రాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టడం వెనకాల ప్రజలను తమ సమస్యలపై ఆలోచింపనీకుండా పక్కదారి పట్టిస్తున్నారన్నారు. కా॥ ఎన్.వి. కృష్ణయ్య ఆశించిన కార్మిక, కర్షక రాజ్యాన్ని సాధించే కృషిలో నిమగ్నమౌతూ కార్మిక, రైతాంగ ఉద్యమాలు నిర్మించడమే అమరులకు అర్పించే నివాళిగా ఆయన పేర్కొన్నారు.

ఈ సభలో ఇంకా నవయువసమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కా॥ ఎల్.లక్ష్మీరెడ్డి, రైతుకూలీసంఘం - ఆం.ప్ర. జిల్లా కార్యదర్శి కా॥ జి.సునీత, డా॥ చెంజి కాళప్ప, ఎన్‌వికె మిత్రులు కా॥ ఎస్.వి. రాజగోపాల్, యాతలూరు గ్రామ నాయకులు డి.ఆనంద్, తదితరులు ప్రసంగించగా సంఘం జిల్లా సహాయకార్యదర్శి కా॥ వి.వి.రమణయ్య ఈ సభకు అధ్యక్షత వహించారు.

సభకు ముందుగా విద్యార్థులు ప్రదర్శించిన కోలాటం, కళాకారుల పాటలు ప్రజలను ఆకట్టుకున్నాయి. స్థూపం వద్దనున్న ఎర్రజెండాను గ్రామ కమిటి నాయకులు కా॥ వీరయ్య ఎగురవేయగా, కా॥ ఎన్‌వికె చిత్రపటానికి ఎస్.వి. రాజగోపాల్ పూలమాలవేసి జోహార్లు తెలిపారు.